ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 39.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5



అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 2 ఏప్రిల్ 2025

వనమంతా.. సందడి



శిల్పారామంలో పచ్చటి చెట్ల కింద ఆహ్లాదంగా గడుపుతున్న ముస్లింలు







రంజాన్ పర్వదినం ముగిశాక.. మరుసటి రోజు ముస్లింలు సంప్రదాయం ప్రకారం వనభోజనాలకు వెళ్లారు. నీరు, నీడ ఉండే నచ్చిన ప్రాంతాలకు వెళ్లి.. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ హాయిగా గడిపారు. ఈ క్రమంలో అనంతపురం నగర శివారులోని శిల్పారామం వందలాది మందితో కళకళలాడింది. చిన్నా, పెద్ద తేడా లేకుండా చెట్ల నీడలో ఆడుతూ, పాడుతూ గడిపారు. విందు భోజనాలను ఆరగించారు. - ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్

ఇంకోసారి..!

ఒకే ఇంట్లోకి రెండుసార్లు చొరబడి.. దొరికిన దొంగ



బీరువా తలుపులు తెరిచిన దృశ్యం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడ్డాడు. బీరువా తాళాలు తీసి రూ.50 వేలు తీసుకుని జారుకున్నాడు. కాసేపటి తరువాత మరోమారు అదే ఇంట్లోకి వెళ్లాడు. మిగిలిన సొమ్ము తీసుకుని వెళుతూ దొరికిపోయాడు. ఈ ఘటన బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామంలో ఓ వృద్ధురాలు మృతిచెందడంతో తలారి వన్నూరుస్వామి భజన చేసేందుకు వెళ్లాడు. ఇంట్లో ఆయన భార్య అనంతమ్మ మాత్రమే ఉన్నారు. ఆమె గాఢ నిద్రలో ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చొరబడి.. బీరువాలో ఉన్న రూ.50 వేలు చోరీ చేశాడు. మరోసారి కూడా అదే ఇంట్లోకి వెళ్లి చోరీ చేస్తుండగా అనంతమ్మకు మెలకువ వచ్చి గట్టిగా కేకలు వేసింది. దీంతో ఇరుగూ పొరుగువారు అప్రమత్తమై దొంగను పట్టుకున్నారు. కాజేసిన సొమ్మును తిరిగి ఇవ్వాలని సూచించి, మందలించి వదిలేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు.

ఆత్మకూరు హెచ్ఎం సస్పెన్షన్

అనంతపురం విద్య, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ప్రసాద్‌పై పాఠశాల విద్య కడప ఆర్జేడీ శామ్యూల్ మంగళవారం సస్పెన్షన్ వేటు వేశారు. ఆత్మకూరు కేజీబీవీ విద్యార్థిని శ్రావణి గతనెల 29వ తేదీన పదో తరగతి పరీక్షలు రాసేందుకు ఆత్మకూరు జడ్పీ హైస్కూల్‌కు వెళ్లింది. పరీక్షల రాసే సమయంలో ప్రశ్నాపత్రం మిస్సయిందన్న నెపంతో చీఫ్ సూపరింటెండెంట్ అయిన శ్రీనివాస్ ప్రసాద్ విద్యార్థిని భుజం పైభాగంలో కర్రతో కొట్టడంతో కాలర్ బోన్ విరిగింది. దీంతో ఆయనను ఆర్జేడీ సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై డిప్యూటీ డీఈఓను విచారణాధికారిగా నియమించినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు.

12.45 గంటల వరకే బడులు

ఆ తర్వాత నిర్వహిస్తే చర్యలు: డీఈఓ

అనంతపురం విద్య, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒంటిపూట బడులు నిబంధనల మేరకు నడపాలనీ, అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఈఓ ప్రసాద్‌బాబు మంగళవారం ప్రకటనలో హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ నిర్వహించాలన్నారు. మధ్యాహ్నం 12.45 తర్వాత స్కూళ్లు పనిచేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే... కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

భూసేకరణ, రీసర్వేపై నిర్లక్ష్యం వద్దు

జాయింట్ కలెక్టర్



సమీక్షిస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ, రైతు సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రీసర్వే విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని అధికారులకు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. ప్రాజెక్టులకు భూసేకరణ, రీసర్వేపై కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ.. జిల్లాలో రీసర్వే ప్రక్రియను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. ఐవీఆర్ఎస్ సర్వేలో గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులొస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, తహసీల్దార్లు, జాతీయ రహదారుల అధికారి తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

పీఎంశ్రీ పరుగులు

రెండు విడతల్లో
42 పాఠశాలల ఎంపిక
18 స్కూళ్లలో ల్యాబ్‌ల అభివృద్ధి పూర్తి
రాష్ట్రంలో అనంతకు అగ్రస్థానం
బడులు తెరిచేలోగా మిగిలిన పనులు పూర్తి

ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు



అనంతపురం విద్య, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పాఠశాలలు పనులు పరుగులు పెడుతున్నాయి. ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం కింద జిల్లావ్యాప్తంగా 42 పాఠశాలల్లో రూ.కోట్ల విలువైన పనులు రెండు విడతల్లో మొదలయ్యాయి. ఇందులో ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి. మొదటి విడతలో 18 పాఠశాలల్లో కెమిస్ట్రీ ల్యాబ్స్ పనులు శరవేగంగా పూర్తి చేసి.. జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి సమగ్రశిక్ష జిల్లా అధికారులకు ప్రశంసలు దక్కాయి. మొదటి విడతలో రూ.9.1 కోట్లతో కంప్యూటర్, లైబ్రరీ రూమ్స్, కిచెన్, గార్డెన్లు, ప్లేగ్రౌండ్స్ పనులు చేపట్టారు.

2022లో అంకురార్పణ

పీఎంశ్రీ పేరిట 2022లో కేంద్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూళ్లగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో దేశావ్యాప్తంగా పనులు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా ప్రమాణాలు, మౌలిక వసతులు, విద్యార్థుల ప్రగతి తదితర అంశాలను పరిశీలించి.. ఈ పథకానికి ఎంపిక చేస్తారు. ఎంపికైన పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్స్, కెమిస్ట్రీ ల్యాబ్స్, సైన్స్ ల్యాబ్స్, ప్లే గ్రౌండ్స్, ఎలక్ట్రిసిటీ, ఇంటర్నెట్ కనెక్షన్ తదితర వసతులు కల్పిస్తారు. జిల్లాలో ఫేజ్ -1, ఫేజ్ 2 కింద 42 పాఠశాలలను ఎంపిక చేశారు. మొదటి విడతలో 38, రెండో విడతలో 4 పాఠశాలలను ఎంపిక చేశారు. మొదటి విడత పనులు ఇప్పటికే పూర్తిగాకా, రెండో విడత పనులు కొనసాగుతున్నాయి.



బుక్కరాయసముద్రం స్కూల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన కప్‌బోర్డులు

ఎంపికైన పాఠశాలలు ఇవే..

- కురుగుంట, గుత్తి బాలికల ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలు
- అనంతపురంలోని బాలికల ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల
- ఆత్మకూరు, గార్లదిన్నె, బొమ్మనహాళ్, బుక్కరాయసముద్రం, మురిడి, గోళ్లపల్లె, పాత కొత్త చెరువు, కంబదూరు, ఎనుములదొడ్డి, ఖాదర్‌పేట, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, లక్షుంపల్లి, కడవకల్లు, రాప్తాడు, తరిమెల, చుక్కలూరు, విడపనకల్లు, రాయలచెరువు, తిమ్మంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలు
- బ్రహ్మసముద్రం, రాజాపురం, బి పప్పూరు ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలు
- గార్లదిన్నె, కళ్యాణదుర్గం, పామిడి, రాయదుర్గం, శెట్టూరు, వజ్రకరూరు మోడల్ స్కూళ్లు
- గుంతకల్లు ఎస్ఆర్‌కే మున్సిపల్ హైస్కూల్, పాలవాయి ఎంపీయూపీ స్కూల్, తిమ్మాపురం ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ హైస్కూల్, రామగిరి ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్, ఉదిరిపికొండ ఎంపీయూపీ స్కూల్, పామిడి టీసీ గవర్నమెంట్ హైస్కూల్, కొంతనపల్లి ఎంపీయూసీ స్కూల్, తాడిపత్రిలోని ఎస్పీ మున్సిపల్ హైస్కూల్, జేసీఎస్ఆర్ఎంబీ హైస్కూల్, ఉరవకొండ బీసీ బాయ్స్ ఏపీఆర్ఈఐఎస్ స్కూల్

● రాష్ట్రంలో అగ్రస్థానం

పీఎంశ్రీ అభివృద్ధి పనుల్లో జిల్లా రాష్ట్రంలో ముందంజలో నిలిచింది. మొదటి విడతలో చేపట్టిన పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ముఖ్యంగా మొదటి విడతలో కెమిస్ట్రీ ల్యాబ్స్
ప్లేగ్రౌండ్స్ అభివృద్ధి చేసి, క్రీడాపరికరాలను స్కూళ్లకు సమకూర్చారు. ఒక్కో కెమిస్ట్రీ ల్యాబ్‌ను రూ.15.58 లక్షలతో ఏర్పాటు చేశారు. ఇలా 18 స్కూళ్లలో కెమిస్ట్రీ ల్యాబ్స్‌ను అభివృద్ధి చేశారు. మొత్తం రూ.2.80 కోట్లతో కెమిస్ట్రీ ల్యాబ్స్‌ను చాలా త్వరలో పూర్తి చేశారు. ఈ అంశంలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. దీంతో రాష్ట్ర ఉన్నతాధికారులు సమగ్రశిక్ష జిల్లా అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా 36 పాఠశాలలకు ప్లే గ్రౌండ్స్ మంజూరయ్యాయి. వీటిలో రెండు పాఠశాలలకు మైదానాలు లేవు. మిగిలిన 34 పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలకు రూ.5 లక్షలు వెచ్చించి మైదానాలను అభివృద్ధి చేశారు. పలు రకాల క్రీడా పరికరాలను విద్యార్థులకు సమకూర్చారు.

● రూ.9.10 కోట్ల పనులు

ఫేజ్ -1 ఏ కింద ప్రభుత్వ పాఠశాలల్లో పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రస్తుతం 35 కిచెన్ గార్డెన్ వర్క్స్, 25 ర్యాంప్స్ అండ్ హ్యాండ్ రెయిల్స్ వర్క్స్, ఆర్వో ప్లాంట్స్ 27, రెయిన్ హార్వెస్టింగ్ వర్క్స్ 35, సోలార్ ప్యానల్స్ 27 వర్క్స్, 50 బాలికల వాష్‌రూమ్స్ నిర్మాణం, మరో రెండింటి మరమ్మతు పనులు సాగుతున్నాయి. వీటితోపాటు రూ.23 లక్షల వ్యయంతో 8 పాఠశాలల్లో లైబ్రరీ రూమ్స్ పనులు కొనసాగుతున్నాయి. మొత్తంగా 268 పనులను రూ.9.1 కోట్లతో చేపట్టారు. ఈ నెలాఖరలోపు పనులన్నీ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

● రెండో విడత మొదలు..

రెండో విడత ప్రభుత్వం 4 పాఠశాలలను ఎంపిక చేసింది. ఇందులో ఒక పాఠశాలకు కంప్యూటర్ రూమ్, లైబ్రరీ రూం కోసం రూ.41.06 లక్షలు మంజూరు చేశారు. క్రీడా మైదానాల అభివృద్ధి, క్రీడా పరికరాల కోసం ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలు చొప్పున ఇచ్చారు. రెండో విడత పనులు కూడా మొదలయ్యాయి. మరో రెండు నెలల్లో ఇవి పూర్తవుతాయని సమగ్ర శిక్ష అధికారులు చెబుతున్నారు.

జూన్‌కు పూర్తి చేస్తాం..

ప్రభుత్వ పాఠశాలల్లో పీఎంశ్రీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే 18 స్కూళ్లలో కెమిస్ట్రీ ల్యాబ్స్ పూర్తి చేశాం. రాష్ట్రంలోనే జిల్లాకు ఫస్ట్ ప్లేస్ వచ్చింది. 34 పాఠశాలల్లో క్రీడా మైదానాల పనులు కూడా పూర్తయ్యాయి. ఫేజ్-1ఏ కింద సాగుతున్న పనులను ఏప్రిల్ చివరికి పూర్తి చేస్తాం. రెండో విడత పనులను పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలోగా.. జూన్ నాటికి పూర్తి చేస్తాం.

-జయరాం, డీఈఈ, సమగ్రశిక్ష



అనంతపురంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ క్రీడామైదానంలో ఏర్పాటుచేసిన నెట్, ఇతర పరికరాలు

వైభవంగా అంజన్న రథోత్సవం



మురడిలో రథాన్ని లాగుతున్న భక్తులు

డి.హీరేహాళ్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉగాది ఉత్సవాల మూడోరోజు మంగళవారం మురడి ఆంజనేయస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. సుప్రభాతసేవతో స్వామివారి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. పూలు, ఆభరణాలతో అలంకరించి, కుంకుమార్చన, బిల్వార్చన, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించారు. ఏపీ, కర్ణాటక నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, ఎస్ఐ నాగమధు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. చివరి రోజు బుధవారం ఆలయంలో వసంతోత్సవం, లంకాదహనం నిర్వహిస్తారు.

పనులను వేగంగా పూర్తి చేయాలి
రైల్వే డీసీఎం శ్రీకాంత్ రెడ్డి
7

అప్పు తీర్చేందుకు హత్య
యూట్యూబ్‌లో చూసి ప్రణాళిక
మహిళ ప్రాణం తీసిన
వివాహేతర సంబంధం
నాలుగు నెలల తరువాత
వెలుగులోకి..
7



ఆనందమానందమాయె..!
ముగిసిన పది పరీక్షలు
6

తాగునీటి ఎద్దడి తలెత్తకూడదు

అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



అనంతపురం టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్.. ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులు, ఇంజినీర్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి చేతిపంపు, పవర్ బోరు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఉపాధి కూలీలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.375 కోట్లు వేతన రూపంలో చెల్లించేలా లక్ష్యంగా పెట్టుకున్నామనీ, ఆ మేరకు ప్రతిఒక్కరు పనిచేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో డీపీఓ నాగరాజనాయుడు, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి,డ్వామా పీడీ సలీంబాషా పాల్గొన్నారు.



డీఈఓకి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు


టీచర్లతో డిప్యూటీ డీఈఓ దురుసు ప్రవర్తన

- ఆయనపై చర్యలు తీసుకోవాలి
- డీఈఓకు ఫ్యాప్టో నేతల వినతి

అనంతపురం విద్య, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు.. టీచర్లు, సంఘాల నేతలతో దురుసుగా మాట్లాడుతున్నారనీ, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫ్యాప్టో నేతలు.. డీఈఓ ప్రసాద్‌బాబుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. వారు.. డీఈఓను స్థానిక సైన్స్ సెంటర్‌లో కలిశారు. నాయకులు మాట్లాడుతూ... డీఎస్సీల వారీగా మెరిట్ ర్యాంకులు బహిర్గతం చేయాలని కోరారు. పదో తరగతి స్పాట్ డ్యూటీకి 55 ఏళ్ల పైబడిన టీచర్లు, చంటి పిల్లలున్న తల్లులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని మినహాయించాలని కోరారు. రాయదుర్గంలో ఇటీవల ఓపెన్ టెన్త్ పరీక్షల సందర్భంగా పలువురు టీచర్లపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం ఇతర నేతలు పాల్గొన్నారు.

94.94 శాతం పింఛన్ పంపిణీ పూర్తి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పింఛన్ల పంపిణీని 94.94 శాతం పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తెలిపారు. జిల్లాలో 2,79,165 మంది లబ్ధిదారులకుగాను రూ.123.75కోట్ల పింఛన్ సొమ్ము మంజూరైందన్నారు. తొలిరోజు మంగళవారం 2,65,408 మందికి రూ.117.45 కోట్లు పంపిణీ చేసినట్లు పీడీ వెల్లడించారు. మిగిలిన వారికి బుధవారం పంపిణీ చేస్తారన్నారు.





ఏమి హాయిలే..

నా డౌటు ఏమంటే..
ఎండకు తట్టుకోలేక
నిండా మునిగాం కదా..?
కొంగా..! నువ్వెందుకు
ముడుచుక్కూర్చున్నావ్..?
గజగజా వణికించే చలి అన్నట్లు..!

(అనంతపురం శివారులోని పండమేరు వంకలో సేదదీరుతున్న ఎనుములు)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



ప్రశాంతంగా ఉండనీవా..? ఏమైనా పద్ధతేనా..?

ఇంటికోసం దరఖాస్తు చేసుకోండి

హౌసింగ్ పీడీ శైలజ



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థలం ఉన్న వారు ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ పీడీ శైలజ కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రశ్న: పేదల గృహ నిర్మాణానికి ఉన్న ప్రభుత్వ పథకాలు?
పీడీ: ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఉన్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉండే పేదలు ఈ పథకాలకు అర్హులు.

ప్రశ్న: కొత్త ఇళ్ల కోసం ఎప్పుడు దరఖాస్తు చేసుకోవాలి......?
పీడీ: భార్య, భర్తల ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డు, ఎన్‌పీఐసీకి లింక్ అయిన భార్య బ్యాంకు అకౌంట్ పాసుబుక్, స్థలం పట్టా, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉండాలి. రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డుకు అనుసంధానం అయిన ఫోన్ నంబరు, పాన్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను ఆయా మండల ఎంపీడీఓ, తహసీల్దార్, హౌసింగ్ ఏఈలు సభ్యులుగా ఉండే మల్టీ డిసిప్లెన్ టీం పరిశీలన చేసిన అనంతరం పీడీ కార్యాలయానికి పంపుతారు. ఆసక్తి, అర్హతగల సొంత స్థలం ఉండే వారు హౌసింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: కొత్త ఇళ్ల నిర్మాణాలకు ఎంత మొత్తం చెల్లిస్తారు.....?
పీడీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించి రూ.2.5లక్షలు చెల్లిస్తారు. ఇందులో ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు మొత్తాన్ని అందిస్తారు.

ఇంటర్వ్యూ
interview

ప్రశ్న: వైసీపీ ప్రభుత్వంలో ఎన్ని లే అవుట్లలో ఎన్ని ఇళ్లు మంజూరు చేశారు? ఎన్ని పూర్తి చేశారు ?
పీడీ: 2019-24 మధ్య కాలంలో జిల్లాలో 412లే అవుట్లలో 41,351ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 13,472ఇళ్లు పూర్తి చేశారు. మిగిలిన 27,878ఇళ్లు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ప్రశ్న: వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన ఇళ్ల పరిస్థితి ఏమిటి...?
పీడీ: గత ప్రభుత్వంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేయడానికి ప్రస్తుత ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. బీసీ, ఎస్సీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా రూ.75 వేలు ఆర్థిక సహాయం అందిస్తోంది. దీంతో లబ్ధిదారులను చైతన్యం చేసి అసంపూర్తి ఇళ్లను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: హౌసింగ్ లబ్ధిదారులకు అదనపు సాయం ఎంతమందికి, ఎంత అందజేశారు....?
పీడీ: మొదటి విడతలో 6080మంది లబ్ధిదారులకు రూ.9.11కోట్లు నిధు లు మంజూరు చేశారు. ఇప్పటికే 4వేల మంది లబ్ధిదారులకు రూ.5.94కోట్లు వారి ఖాతాల్లో జమచేశారు. అయితే సొమ్ము పడిన లబ్ధిదారులను చైతన్యం చేసి అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని ఇంజనీర్లకు సూచించారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బుక్కపట్నం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో ఖాళీగా ఉన్న 17 అధ్యాపక పోస్టుల్లో డెప్యుటేషన్‌పై పనిచేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ, మున్సిపల్, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, ఎంఈఓలు అర్హులన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన, 58 సంవత్సరాల వయసువారు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 16, 17 తేదీల్లో రాత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 17న ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 9949993712 నంబరులోగానీ, డీఈఓ కార్యాలయంలోగానీ సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

మార్కెట్‌కు వచ్చిన చింత పండు



- రంగు తగ్గిందని పడిపోయిన ధర
- క్వింటానికి రూ.7వేల వరకు తగ్గింపు
- గిట్టుబాటు కాలేదని రైతుల ఆందోళన

రైతుకు చింతేనా..?

హిందూపురం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చింత ధరలు పడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు వస్తున్న చింత పండు ధరలు వారం వారం తగ్గుతూ వస్తున్నాయి. మార్కెట్ ప్రారంభంలో ఆశించిన మేర ధరలు పలికాయి. మార్చిలో మరింత ధర పెరుగుతుందని రైతులు ఆశించారు. కానీ ఫిబ్రవరి, మార్చి ఆఖరికి ధరలతో పోల్చితే మేలురకం కర్పూళి క్వింటాల్‌పై రూ. 7 వేల దాకా ధరలు తగ్గడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పురం వ్యవసాయ మార్కెట్ యార్డుకు జిల్లా నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున చింతపండు వస్తుంది. ఇక్కడికి కర్పూళి రకం ఎక్కువగా వస్తుంది. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు 1700 క్వింటాళ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అనధికారికంగా సుమారు 4 వేల క్వింటాళ్ల వరకు వచ్చినట్లు అంచనా. మేలు రకం కర్పూళి క్వింటాల్ రూ. 27 వేలు పలికింది. రెండో రకం రూ. 13 వేలు, మూడోరకం రూ. 8,100 పలికాయి. మార్కెట్‌కి వచ్చిన ఫ్లవర్ రకంలో మొదటిది రూ. 12,500, రెండోది రూ. 7500, మూడోరకం రూ. 4,500 పలికాయి. ఇదే చింతపండు మార్చి 10న మేలు రకం క్వింటాల్ ధర రూ. 40 వేలు, 12న రూ. 33 వేలు పలికింది. ఫిబ్రవరి నెలలో మేలు రకం రూ. 33 వేలు, రెండో రకం రూ. 15 వేల దాకా పలికాయి. ఈ లెక్కన క్వింటాల్‌పై రూ. 7 వేలకు పైగానే ధరలు తగ్గినట్లు రైతులు చెబుతున్నారు.

రంగు తగ్గిందని..

సాధారణంగా మార్చి నెలలో చింతపండు రంగు బాగుంటుంది. అకాల వర్షాల కారణంగా కొంత వరకు రంగుమారింది. దీనిని సాకుగా చూపి క్వింటాల్‌కు రూ. 7 వేల దాకా ధర తగ్గించడం అన్యాయమని రైతులు వాపోతున్నారు. బయటి వ్యాపారులు రాలేదంటే స్థానిక వ్యాపారులే కొనుగోలు చేసి స్టాక్ పెట్టుకోవాల్సి వచ్చింది. మార్చి నుంచి ఏప్రిల్ 15 వరకు చింత పండు నాణ్యంగా ఉంటుంది. ఈ సమయంలో రంగు బాగా ఉంటుంది. కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచుతారు. అనంతరం కర్నూలు, విజయవాడ, నెల్లూరు, చిత్తూరు తమిళనాడు ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి నిల్వ చేస్తారు. ఈసారి బయటి వ్యాపారులు రాలేదని తెలుస్తోంది.

ఆలస్యంగా మార్కెట్ ప్రారంభం

సాధారణంగా ప్రతి ఏడాది జనవరి నెలలోనే చింతపండు మార్కెట్‌కి వస్తుంది. కానీ ఈసారి ఫిబ్రవరి 2వ తేదీ మార్కెట్ ప్రారంభించారు. మార్చిలో ధరలు తగ్గడం వెనక కారణాలు ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా తక్కువ సరుకు ఉన్న రైతులు ఉగాది పండుగ ముందు వారంలో మార్కెట్‌కి తీసుకువచ్చి విక్రయిస్తారు. ఈసారి మార్చి 15 తరవాత వచ్చిన రైతులకు చింతే మిగిలింది.

కూలి కూడా గిట్టదు

ప్రస్తుతం చింత చెట్టు నుంచి కాయలు కోయాలంటే ఒక్కో కూలికి రూ. 1000 నుంచి రూ. 1200 ఇవ్వాలి. కాయలు ఏరేందుకు మహిళలకు రూ. 500 కూలి ఇవ్వాలి. కోసిన చింతకాయను కట్టికాయ చేయడానికి కూలికి రూ. 700 ఇవ్వాలి. కట్టి కాయను కర్పూళి చేసేందుకు కిలోకి రూ. 30 ఇవ్వాలి. ఇలా కూలీలు లెక్కిస్తే రైతుకి గానీ, చింతచెట్టు కొనుగోలు చేసిన వారికి కానీ మిగిలేదేమీ ఉండదు. ఈసారి అనుకున్న రీతిలో చింత ఫలసాయం అందలేదు. సాధారణంగా కొన్ని చింత చెట్ల నుంచి తెచ్చిన 10 కిలోల కట్టి కాయను కొడితే 6 నుంచి 7 కిలోలు వచ్చేది. ఇప్పుడైతే 5 నుంచి 5.5 కిలోలకే పడిపోయింది. దీనివల్ల 10 కిలోల కట్టి కాయకు 300 దాకా నష్టం వస్తుంది. మార్కెట్‌కు తీసుకెళితే మార్కెట్ కూలీలు, కమీషన్లు లెక్కిస్తే రైతులకు మిగిలేదేమీలేదు. చింతపండుతో ఈసారి నష్టమే తప్పా లాభం లేదు.

ఈ ఏడాది పంట నష్టమే



ఒకే చెట్టులోని చింత పండు మూడు వారాలుగా తీసుకువస్తున్నా. మొదటి వారం రూ. 22 వేలు, రెండో వారం రూ. 20 వేలు, గురువారం రూ. 16 వేలు ధర పలికింది. ఈ లెక్కన క్వింటాల్‌పై ఐదారు వేల వరకు నష్టపోయాను. దీనికి తోడు కూలీలు రేట్లు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం చింతపండుకు ధర నిర్ణయిస్తే తప్పా భవిష్యత్తులో చింత రైతులకు మిగిలేదు ఏమీ ఉండదు.

- గోవిందప్ప, శిర మండలం

రెండువారాల్లో రూ. 7 వేలు తగ్గింది



రెండు వారాల క్రితం హిందూపురం మార్కెట్‌కి కర్పూళి రకం తీసుకువస్తే రూ. 23 వేలు పలికింది. అదే చెట్టులోని కాయ గురువారం రూ. 16 వేలు పలికింది. ఈ లెక్కన క్వింటాల్‌కి రూ. 7 వేలు తగ్గింది. దీంతో లాభం వచ్చే పరిస్థితి లేదు. ఇలా అయితే చింత చెట్టు దులుపడం కూడా మానేయాలి.

- సూలప్ప, రైతు, గుడిబండ

ఆనందమానంద మాయె..!

ముగిసిన పది పరీక్షలు



బడి జీవితం ముగిసింది.. ఇక కాలేజీలో కలుద్దాం నేస్తం..





ఉపశమనం.. ఎండ నుంచి.. పరీక్షల నుంచి..

పది పరీక్షలు ముగిశాయి. ఇన్నాళ్లూ పుస్తక ప్రపంచంలో మునిగి తేలిన విద్యార్థులు హాయిగా.. స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్నారు. అందరి ముఖాలు ఆనందంతో వికసించాయి. బడి దాటి.. కాలేజీ కాంపౌండ్‌లోకి అడుగుపెట్టబోతున్న అందరూ.. ఇన్నాళ్లూ కలిసి చదివిన తమ ఆత్మీయ మిత్రులతో సెల్ఫీలు దిగారు. షేక్ హ్యాండ్ ఇచ్చుకుని వీడ్కోలు చెప్పుకున్నారు. అనంతపురంలోని హాస్టళ్లలో ఉంటున్నవారు పెట్టె బేడ సర్దుకుని ఇంటి బాట పట్టారు. వారిని తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో ప్రైవేటు, కార్పొరేట్ రెసిడెన్షియల్ పాఠశాలల వద్ద సందడి కనిపించింది.

400 మంది గైర్హాజరు

పదో తరగతి పరీక్షల చివరి రోజు సోషల్ పరీక్షకు 400 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 30,997 మందికిగాను 30,638 మంది పరీక్ష రాశారు. ప్రైవేట్ విద్యార్థులు 203 మందికిగాను 162 మంది హాజరయ్యారు. సిట్టింగ్ స్క్వాడ్ 32 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 7 కేంద్రాలను తనిఖీ చేశాయి. గత నెల 17న మొదలైన పరీక్షలు ముగియడంతో అధికారులు స్పాట్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య



పదో సెల్ఫీ



మోసేంత బరువు.. ఇక ఇంటికి..



ఇక పదమ్మా...

ఉపాధికి పంచ ప్రాధాన్యాలు

- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ
- వేసవిలో ఉపయోగకర పనులకు శ్రీకారం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఐదు ప్రాధాన్యాలతో ఉపాధి పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, డ్వామా పీడీలకు పలు సూచనలు చేసింది. ఇందులో ప్రధానంగా పశువుల నీటి తొట్టెలు, చెరువుల పునరుద్ధరణ, ఫాంపాండ్లు, సగటు వేతనం, ఫీడర్ చానల్ నిర్మాణం చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది.

పశువుల నీటి తొట్టెలు



పశువుల నీటి తొట్టెలు

వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని పశువులు తాగునీటికి ఇబ్బంది పడకుండా నీటి తొట్టెలు నిర్మాణం చేపట్టనున్నారు. జిల్లాలో 646 నీటి తొట్టెల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏప్రిల్ 10 నాటికి నీటి తొట్టెల నిర్మాణం పూర్తి చేసి పైపులైన్ ద్వారా నీటిని నింపి పశువుల దాహార్తి తీర్చాలని ప్రభుత్వం ఆదేశించింది.

చెరువుల పునరుద్ధరణ

గ్రామానికి, రోడ్లకు సమీపంలో ఉన్న చెరువులను గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి మండలంలో 5 ఎకరాలలోపు ఉండే రెండు చెరువులను ఇలా గుర్తించి అందంగా తయారు చేయనున్నారు. మొదటి మూడు నెలల్లో కనీసం 31చెరువులు అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

ఫాంపాండ్ల నిర్మాణం

ప్రతి రైతు పొలంలో సేద్యపు నీటి కుంటలను నిర్మించాలని సంకల్పించారు. జిల్లాకు 9వేలు లక్ష్యంగా నిర్ణయించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఈ ఫాంపాండ్లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఫాంపాండ్లలో నీటిని నిల్వ చేసుకుంటే భూగర్భ జలాల పెరగడంతోపాటు పశువులకు వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఏప్రిల్ నెలలో 4500, మే నెలలో 2700, జూన్‌లో 1800 ఫాంపాండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఫీడర్ చానల్ పునరుద్ధరణ

జిల్లాలో సాగునీటి కాలువల్లో పూడిక తీత చేపట్టి రాబోయే పంట సమయానికి ఆయకట్టు చివరి పొలం వరకు సాగునీరు అందేలా ప్రతి కాలువను పునరుద్ధరించాలి. జిల్లాలో మొదటి దశలో 93 కిలోమీటర్ల ఫీడర్ చానల్ కాలువ పూడికతీత పనులు చేపట్టాలని నిర్ణయించారు.

ఉపాధి కూలీకి సగటు వేతనం




ఉపాధి హామీ కూలీలకు సగటున దినసరి వేతనం రూ.300 పొందేలా గ్రూపు మార్కింగ్ ఇచ్చి కనీసం 5గంటలు పని ప్రదేశంలో ఉండాలని నిర్దేశించారు. ఇందుకు కూలీలకు, మేట్లకు కనీస అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధి పథకం సిబ్బందిపై ఉంది.

జిల్లాకు మేలు

ఉపాధి హామీ పథకంలో పంచ ప్రాధాన్యాలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పలు ఆదేశాలు ఇచ్చింది. కలెక్టర్ నేతృత్వంలో ఉపాధి పథకాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తాం. ఈక్రమంలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు పశువుల నీటితొట్టెలు, చెరువుల పునరుద్ధరణ, ఫాంపాండ్ల నిర్మాణం, ఉపాధి కూలీకి సగటు వేతనం, ఫీడర్‌చానల్ నిర్మాణం చేపట్టాలి. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు నీటి సదుపాయం, రైతులకు మేలు, ఉపాధి కూలీలకు కనీస వేతనం పెంపునకు పంచప్రాధాన్యాలు తోడ్పడతాయి.

- సలీంబాషా, డ్వామా పీడీ



చెరువుల పునరుద్ధరణ ఇలా

అవమానించారని ఆత్మహత్య



ఓబిరెడ్డి (ఫైల్)

కనగానపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తగరకుంటలో ఓబిరెడ్డి(32) అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తగరకుంట, కేకే తండాకు చెందిన కొందరు అవమానించినందుకే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఓబిరెడ్డి తండ్రి సుబ్బిరెడ్డి, కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓబిరెడ్డి ఎంబీఏ మధ్యలో మానేసి తండ్రికి తోడుగా వ్యవసాయ పనులు చేసేవాడు. తల్లిదండ్రులు గ్రామ శివారులోని ఆవులషెడ్‌లో ఉంటున్నారు. ఓబిరెడ్డి తగరకుంటలోని ఇంటిలో ఉండేవాడు. ఓబిరెడ్డిని కలిసేందుకు మంగళవారం ఉదయం అతని స్నేహితులు వెళ్లారు. అప్పటికే ఇంటి దూలానికి ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో వారు డయల్ 100 ఫోన్ చేసి విషయం తెలియజేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. ఈ ప్రాంతంలో ఐపీఎల్ బెట్టింగ్ బాగా జరుగుతోంది. దీంతో ఓబిరెడ్డి ఆత్మహత్యపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

మద్యానికి బానిసై..

తాడిపత్రి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటాంపల్లిలో చిన్నవజీర్ (22) అనే యువకుడు మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న చిన్న వజీర్.. మద్యానికి బానియ్యాడని, పనులు లేకపోవడంతో దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నె-తాటిచెర్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతిచెందారని రైల్వే ఎస్ఐ వెంకటేష్ మంగళవారం తెలిపారు. అతని వయసు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. యాదగిరి నుంచి యశ్వంతపూర్ వెళ్లడానికి కొనుగోలు చేసిన జనరల్ టిక్కెట్ లభించిందని తెలిపారు. పసుపు రంగు టీ షర్టు, లైట్ సిమెంట్ కలర్ ప్యాంటు ధరించాడని తెలిపారు. ఎడమచేతికి పి.మహి అని పచ్చబొట్టు వేయించుకున్నాడని, కుడి చేతిపై ఎంఎస్ అని ఉందని అన్నారు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని తెలిపారు.

బావను చంపిన బావమరిది



మృతి చెందిన నారాయణ

సోమందేపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇంట్లో తనకంటే అల్లుడికే ప్రాధాన్యం ఇస్తున్నారని గొడవపడిన కొడుకు.. తన బావను కర్రతో కొట్టి చంపేశాడు. ఈ సంఘటన సోమందేపల్లి పట్టణంలోని సాయినగర్‌లో చోటు చేసుకుంది. ఉగాది పండుగకు తన భార్యతో కలిసి నారాయణ(35) అత్తవారింటికి వచ్చాడు. బావమరిది మారితో కలిసి మంగళవారం మద్యం సేవించాడు. ఇంట్లో కొడుకుల కంటే అల్లుడికే ప్రాధాన్యం ఇస్తున్నారని తల్లితో మారి గొడవపడి, ఆమెపై దాడి చేశాడు. అడ్డు వచ్చిన తన అన్న అంజి, బావ నారాయణపై కర్రతో దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నారాయణ అక్కడిక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేష్ తెలిపారు.

చైన్‌స్నాచర్ బరితెగింపు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ చైన్‌స్నాచర్ బరితెగించాడు. పింఛన్ల పంపిణీకి స్కూటర్‌పై వెళుతున్న 71వ సచివాలయ ఉద్యోగి శకుంతలను అటకాయించి, మెడలో బంగారు గొలుసు తెంచుకుపోయాడు. హెచ్చెల్సీ పక్కనున్న దారిలో వెళుతున్న ఆమెను అగంతకుడు బైక్‌లో వెంబడించాడు. హఠాత్తుగా తన బైక్‌ను ఆమె స్కూటర్‌కు అడ్డుపెట్టాడు. ఆమె కింద పడగానే మెడలోని బంగారు గొలుసు తెంచే ప్రయత్నం చేశాడు. ఆమె గట్టిగా పట్టుకోవడంతో గొలుసు తెగిపోయింది. మూడున్నర తులాల గొలుసులో ఆమె వద్ద రెండుతులాలు మిగిలిపోగా.. ఒకటిన్నర తులంతో దొంగ పరారయ్యాడు. శకుంతలకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితురాలు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టమోటా కిలో రూ. 8

అనంతపురం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 90 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ. 26వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 26,530 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 746 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంచానపల్లిలో రెండురోజుల క్రితం ఎద్దు పొడిచి తీ వ్రంగా గాయపడిన గాజుల సుబ్బమ్మ (70) అనే వృద్ధురాలు మంగళవారం మృతి చెందారు. ఇంటి వద్ద సుబ్బమ్మ పేడ తీస్తుండగా ఎద్దు పొడిచింది. బళ్లారి విమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలికి నలుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

అప్పు తీర్చేందుకు హత్య

యూ ట్యూబ్ చూసి ప్రణాళిక

మహిళ ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

నాలుగు నెలల తరువాత వెలుగులోకి వ్యవహారం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, ట్రైనీ డీఎస్పీ తదితరులు

మడకశిర టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పొరుగింట్లో ఉన్న మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అప్పులు తీర్చేందుకు ఆమె బంగారంపై కన్నేశాడు. హత్య ఎలా చేయాలో యూ ట్యూబ్‌లో చూసి తెలుసుకున్నాడు. ఆమెను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి కడతేర్చాడు. మడకశిర మండలం ఉగ్రేపల్లి అటవీ ప్రాంతంలో నాలుగు నెలల క్రితం జరిగిన ఈ హత్య కేసును ట్రెయినీ డీఎస్పీ ఉదయపావని, సీఐ రాజ్‌కుమార్ ఛేదించారు. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ట్రెయినీ డీఎస్పీ ఉదయపావని మంగళవారం కేసు వివరాలను విలేకరులకు తెలిపారు. కదిరేపల్లికి చెందిన బి.నరసింహమూర్తి పావగడ నియోజకవర్గంలోని అరసికెరెకు చెందిన ఉమాదేవితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఉమాదేవి బెంగళూరులో ఓ గార్మెంట్ పరిశ్రమలో పనిచేస్తున్న సమయంలో నరసింహమూర్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలో అప్పుల్లో ఉన్న నరసింహమూర్తి కన్ను ఉమాదేవి వద్ద ఉన్న బంగారంపై పడింది. ఉమాదేవి అరసికెరెలో ఉండగా నరసింహమూర్తి ఫోన్‌చేసి కదిరేపల్లికి రమ్మన్నాడు. అప్పటికే యూట్యూబ్ ద్వారా మహిళను ఎలా హత్యచేయాలలో తెలుసుకుని, అవసరమైన తాడును సిద్ధం చేసుకున్నాడు. మడకశిరకు వచ్చిన ఆమెను ఉగ్రేపల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ తాడుతో చేతులను కట్టేసి హత్య చేశాడు. మృతదేహాన్ని అక్కడే పూడ్చి, ఆధారాలు లేకుండా చేసి, బెంగళూరుకు వెళ్లిపోయాడు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని గత నెల 15న గుర్తించారు. అప్పటికే అరసికెరెలో మిస్సింగ్ కేసు నమోదు కావడంతో ఉమాదేవి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహం కాళ్లకు ఉన్న పట్టీలు, ఇతర ఆనవాళ్లను వారు గుర్తించారు. ట్రెయినీ డీఎస్పీ ఉదయపావని ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఈ కేసును దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేసింది. ఉమాదేవికి చెందిన బంగారు మంగళసూత్రం గొలుసు, కమ్మలు, ముక్కుపుడుక తదితర ఆభరణాలను నిందితుడు కుదువపెట్టి డబ్బు తీసుకున్నట్లు విచారణలో తేలింది. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో అర్బన్ సీఐ నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లింగమయ్య హత్య కేసులో ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐ శ్రీధర్

ధర్మవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన మజ్జిగ లింగమయ్య హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, రామగిరి సీఐ శ్రీధర్ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మజ్జిగ లింగమయ్య కుమారుడు మనోహర్ మార్చి 30న తన అత్తగారి ఇంటికి వెళుతుండగా ఆదర్స్, అతని అనుచరులు హేళన చేశారు. ఈ విషయాన్ని మనోహర్ తన తండ్రి లింగమయ్యకు ఫోన్ చేసి తెలియజేశాడు. లింగమయ్య వారిని ప్రశ్నించడంతో ఆదర్స్, మనోజ్ నాయుడు కట్టెలతో దాడి చేశారు. దీంతో లింగమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అడ్డుకోబోయిన చిన్న కుమారుడు శ్రీనివాసులు గాయపడ్డాడు. లింగమయ్యను అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. లింగమయ్య భార్య రామాంజినమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రామగిరి శివారులోని 11 కేవీ కరెంటు ఆఫీసు వద్ద ఉన్న ఆదర్స్, మనోజ్ నాయుడును అరెస్టు చేశారు.

పనులను వేగంగా పూర్తి చేయాలి

రైల్వే డీసీఎం శ్రీకాంత్ రెడ్డి



ధర్మవరం రైల్వేస్టేషన్ పరిసరప్రాంతాలను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

అనంతపురం న్యూటౌన్/ధర్మవరం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం, ధర్మవరం రైల్వే స్టేషన్‌లలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని డివిజన్ కమర్షియల్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి ఆదేశించారు. రెండు ప్రాంతాలలో అభివృద్ధి పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రాష్ట్రంలో 53 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో 17 రైల్వే స్టేషన్లలో రూ.446 కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. అనంతపురం స్టేషన్‌కు రూ.29 కోట్లు ఇచ్చారని తెలిపారు. తొలివిడతలో రూ.10 కోట్ల పనులు ప్రారంభించామని తెలిపారు. బుకింగ్ కౌంటర్, టి స్టాల్, క్లోక్ రూం, ఫుడ్ కోర్ట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. సెప్టెంబరులో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ధర్మవరం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ కోసం రూ.7.50 కోట్లు కేటాయించారని, తొలి విడత రూ.3.50 కోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు. ధర్మవరం స్టేషన్‌లో ప్లాట్‌ఫాం, విశ్రాంతి గది, బుకింగ్ కౌంటర్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ప్లాట్‌ఫాం వద్ద డ్రైనేజీ నీరు బయటకు వస్తోందని, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని రైల్వే డివిజన్ కమిటీ సభ్యుడు భీమనేని ప్రసాద్ నాయుడు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్టేషన్ మేనేజర్‌లు అశోక్‌కుమార్, చల్లా నరసింహనాయుడు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, సీనియర్ సెక్షన్ సివిల్ ఇంజనీర్ ఉమేశ్‌కుమార్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ బాబూజీరావు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ హరి కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి పరిహారం రూ.5 లక్షలు

వినియోగదారుల న్యాయస్థానం తీర్పు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని విద్యుత్ శాఖను ఆదేశిస్తూ జిల్లా వినియోగదారుల న్యాయస్థానం అధ్యక్షురాలు ఎం.శ్రీలత మంగళవారం తీర్పునిచ్చారు. అనంతపురం నగర శివారులోని పిల్లిగుండ్ల కాలనీకి చెందిన సామలూరు పుల్లయ్య కడప జిల్లా పులివెందులలో కూలి పనికి వెళ్లి 2022 డిసెంబరు 15 విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే నెల 18న మృతి చెందాడు. ఈ ఘటనపై పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పుల్లయ్య భార్య యశోద కడప జిల్లా విద్యుత్ శాఖాధికారులను సంప్రదించి పరిహారం కోరారు. పుల్లయ్య తన నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు పోగొట్టుకున్నారని, తమకు ఎలాంటి బాధ్యత ఉండదని విద్యుత్ శాఖ అధికారులు తేలిపోయారు. లీగల్ నోటీసు పంపినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితురాలు అనంతపురం జిల్లా వినియోగదారుల న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నోటీసులు స్వీకరించిన విద్యుత్ శాఖ అధికారులు, కమిషన్ ఎదుట హాజరై 11కేవీ లైన్‌లకు సంబంధించి మాత్రమే తమకు బాధ్యత ఉంటుందని, వ్యక్తి నిర్లక్ష్యం కారణంగా మృతి చెందితే యజమానికి బాధ్యత ఉంటుందని వాదన వినిపించారు. కేసు వివరాలను పరిశీలించిన న్యాయస్థానం, పరిహారాల నిబంధనలను అనుసరించి బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఆదేశించారు. సేవాలోపానికి రూ.10వేలు, మనోవేదనకు రూ.10వేలు, ఖర్చులకు రూ.3 వేలు 45 రోజుల్లోగా చెల్లించాలని అధ్యక్షురాలు శ్రీలత, సభ్యులు గ్రేస్ మేరీ ఆదేశించారు. పుల్లయ్య తల్లికి, భార్యకు, ఇద్దరు కూతుళ్లకు రూ.5 లక్షల పరిహారం సమానంగా చెందాలని ఆదేశించారు. కూతుళ్లకు చెందే వాటాను మైనార్టీ తీరేదాకా జాతీయ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్‌గా ఉంచాలని, దానిపై వడ్డీ, కమిషన్ ఆదేశించిన ఖర్చులు మృతుడి భార్యకు చెందాలని తీర్పులో పేర్కొన్నారు.

నిరీక్షణ ఫలించేనా..?

- నామినేటెడ్ పదవులపై ఆశలు
- ఆలయాలు, మార్కెట్ యార్డులు సహా పలు పోస్టులు ఖాళీ
- రాష్ట్ర స్థాయి పోస్టులపై కొందరి గురి
- ఇప్పటి వరకూ కదిరికి దక్కని చోటు



కదిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల ప్రకటన వెలువడినప్పుడల్లా.. జాబితాలో తమ పేరు ఉంటుందేమోనని ఎదురు చూస్తున్న కదిరి నియోజకవర్గ నాయకులకు నిరీక్షణే మిగులుతోంది. ఇప్పటి వరకూ రాష్ట్ర స్థాయిలో ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో కదిరికి ఒక్క డైరెక్టర్ పదవి కూడా దక్కలేదు. మూడో విడత నామినేటెడ్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం జాబితాలు సిద్ధం చేస్తుండడంతో నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి నాయకులు ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో చైర్మన్, డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రసిద్ధిగాంచిన ఖాద్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంతోపాటు కదిరి, తనకల్లు మార్కెట్‌యార్డులు కూడా ఖాళీగానే ఉన్నాయి. వీటి భర్తీ కోసం నాయకులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర స్థాయి పోస్టులకు కూడా కొంతమంది ఆశావహులు ఎదురు చూస్తున్నారు. నామినేటెడ్ పోస్టులు భర్తీ అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి మరింత ఊపు వస్తుందని నాయకులు భావిస్తున్నారు.

నాయకుల ఎదురుచూపు

నామినేటెడ్ పోస్టుల భర్తీ ఊరిస్తూనే ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచిపోయింది. రెండు విడతలు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినా.. కదిరి ప్రాంతానికి డైరెక్టర్ పోస్టులు కానీ, చైర్మన్ పోస్టు కానీ ఒక్కటి కూడా దక్కలేదు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా కూటమి నాయకులు ఈ పదవులపైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ పదవులు భర్తీ అయితే తమకు స్థానాలు దక్కుతాయని ఆశతో ఉన్నారు. కనీసం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో డైరెక్టర్ పోస్టులు దక్కినా తమకు గౌరవం ఉంటుందని భావిస్తున్నారు.

చైర్మన్, డైరెక్టర్ పోస్టుల ఖాళీ

కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా పలు సంస్థలకు చైర్మన్, డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం మారడంతో ఈ పోస్టులు ఖాళీ అయ్యాయి. ముఖ్యంగా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్, కమిటీ సభ్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గడిచిన బ్రహ్మోత్సవాలకు ముందే ఈ పోస్టులు భర్తీ అవుతాయని అందరూ ఆశించారు. కొన్ని కారణాల వల్ల వీటి భర్తీని ఆపినట్లు సమాచారం. చైర్మన్ పోస్టుకు తీవ్రమైన పోటీ ఉన్నట్లు తెలుస్తోంది. వివిధ సామాజిక వర్గాల నుంచి పోటీ పడుతున్నట్లు సమాచారం. కదిరి మార్కెట్‌యార్డును బీసీ జనరల్‌కు రిజర్వ్ చేయడంతో దానిపై అప్పటి వరకు ఆశలు పెట్టుకున్న తలుపుల మండలంలోని ఇద్దరు నాయకులు, కదిరి మండల నాయకులకు నిరాశే మిగిలింది. చైర్మన్ పదవి దక్కకపోయినా.. వైస్ చైర్మన్ పదవైనా తమకు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను పట్టుబడుతున్నట్లు సమాచారం. తనకల్లు మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఎస్టీ మహిళకు రిజర్వ్ కావడంతో ఆ వర్గాల నుంచి ప్రధానంగా ముగ్గురు పోటీ పడుతున్నట్లు తెలిసింది. పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం, ఎర్రదొడ్డి గంగమ్మ దేవస్థానం, తవళం ఆంజనేయస్వామి ఆలయంతోపాటు పాటు చిన్న చిన్న ఆలయాలకు కూడా చైర్మన్, కమిటీ సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంది. వీటిని ఏప్రిల్‌లో భర్తీ చేస్తారని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయానికి ఇటీవల ఆదాయం భారీగా పెరిగింది. ఆ చైర్మన్ స్థానానికి రూరల్ మండల నాయకులతోపాటు కుటాగుళ్లకు చెందిన పలువురు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్ర స్థాయి పోస్టులపై గురి

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పోస్టులపైన స్థానికంగా ఉన్న కొందరు నాయకులు ఆశలు పెట్టుకున్నారు. మైనార్టీ నాయకులు, పాల ఏకరులతోపాటు పలువురు కులవృత్తులకు సంబంధించిన కార్పొరేషన్లలో తమకు చైర్మన్, డైరెక్టర్ పోస్టులు దక్కుతాయని ఆశతో ఉన్నారు. ఉగాది సందర్భంగా జరిగే మూడో విడతలోనైనా తమ పేర్లు ప్రకటిస్తారని ఎదురు చూస్తున్నారు. ఉగాది నాడు ఎంతమందికి తీపి కబురు అందుతుందో వేచి చూడాల్సిందే.

దేశంలోనే అత్యధిక పింఛన్ అందిస్తున్న రాష్ట్రం ఏపీ: మంత్రి సవిత



పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యధిక పింఛన్ సొమ్ము అందిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పట్టణంలో ఇంటింటికీ వెళ్లి మంత్రి మంగళవారం పింఛన్ సొమ్ము అందించారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రూ.63 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు రూ.2,717 కోట్ల ఫించన్ సొమ్ము ప్రతినెలా అందిస్తున్నామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబు 1వ తేదీన పింఛన్ ఇస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటున్నామన్నారు. త్వరలో టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వర్షాలు వచ్చేలోగా పూర్తి చేయండి

ప్రతి రైతూ ఫాం పాండ్స్ తవ్వించుకోవాలి

జిల్లా ప్రత్యేక అధికారి హరినారాయణ

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వర్షాలు వచ్చేలోపు ఫాం పాండ్స్ పనులు పూర్తి చేయాలని డ్వామా అధికారులను జిల్లా ప్రత్యేక అధికారి, ఐఏఎస్ హరినారాయణ ఆదేశించారు. రాంపురం పంచాయతీలో ఉపాధి పనులను జేసీ అభిషేక్ కుమార్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అంతకుముందు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. పంటలను కాపాడుకునేందుకు ఫాం పాండ్స్ ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి రైతు తమ పొలంలో ఫాం పాండ్స్ తవ్వించుకోవాలని సూచించారు. ఆ నీటిని వ్యవసాయానికి, పశువులకు, చేపల పెంపకానికి వాడుకోవచ్చని అన్నారు. మాజీ సర్పంచ్ నరసింహులు పొలంలో తవ్విన ఫాం పాండ్‌ను ఆయన పరిశీలించారు. గ్రామంలో గోకులం షెడ్‌లను పరిశీలించారు. పశువుల నీటి తొట్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పెనుకొండ ఆర్డీఓ కార్యాలయంలో మధ్యాహ్నం జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, ఉపాధి హామీ పథకం పీడీ నరసయ్య, సిరికల్చర్ ఏడీ పద్మావతి పాల్గొన్నారు.

సమస్యలను నిర్భయంగా తెలపండి



ఈదుల బళాపురంలో పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న హరినారాయణ

సోమందేపల్లి: ప్రభుత్వ పథకాలు అందడంలో ఇబ్బందులుంటే ప్రజలు నిర్భయంగా తన దృష్టికి తీసుకురావాలని జిల్లా ప్రత్యేక అధికారి హరినారాయణ సూచించారు. ఈదుల బళాపురంలో పింఛన్‌ల పంపిణీని ఆయన పరిశీలించారు. గ్రామంలో 52 మంది లబ్ధిదారులు ఉండగా, ప్రతి నెలా ఫించన్‌లు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వెంకటేశులు అనే లబ్ధిదారు నిర్మించుకున్న మినీ గోకులాన్ని సర్పంచ్ రామక్క ప్రారంభించారు. అనంతరం పశువుల నీటి తొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సిద్ధ లింగప్ప, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం శివారులో బావిలో పడి గొర్రెల కాపరి రామాంజనేయులు(30) మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నంచర్లకు చెందిన రామాంజనేయులు గొర్రెలను తీసుకొని కసాపురం శివారులోని బావి వద్దకు వచ్చాడు. బావిలోనీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిఉంటాడన్నారు. గమనించిన స్థానికులు బావిలో నుంచి బయటకు తీయగా అతడు అప్పటికే మృతి చెందాడని వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కసాపురం పోలీసులు తెలిపారు.

అభయాంజనేయస్వామి దేవాలయంలో చోరీ

గుత్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీలో అభయాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం చోరీ జరిగింది. హుండీలో ఉన్న రూ.20వేలు అపహరించారు. ఉగాది పండుగను పరస్కరించుకొని దేవాలయంలో అర్చకులు పూజలు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం వచ్చి చూడగా ఆలయంలో ఉన్న హుండీని తెరచిఉండటాన్ని గమనించిన అర్చకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

న్యూస్ బాక్స్

నేడు ప్రజాదర్బార్

● ఎమ్మెల్యే శ్రావణిశ్రీ హాజరు: ఎంపీడీఓ

గార్లదిన్నె, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే ఫిర్యాదులు స్వీక రించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ఎంపీడీఓ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఖడ్గమాల పారాయణం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజున మంగళవారం దేవీ ఖడ్గ మాల స్తోత్ర పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అనంతేశ్వరి సమేత అనంతేశ్వరస్వామి మూలవిరాట్లకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ఆవరణలో సామూహికంగా మణి ద్వీప వర్ణన, దేవీ ఖడ్గమాల స్తోత్ర పారాయణం నిర్వహించారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాద, అన్నదాన వినియోగం చేశారు.

నేడు కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో నిరసన

అనంతపురం విద్య, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన తెలుపను న్నట్లు ఆ సంఘం జిల్లా ఛైర్మన్ శ్రీనివాస్ నాయక్, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం పేర్కొన్నారు. పీఆర్సీ బకాయిలు, ఐఆర్ ప్రకటన, డీఏ, సరెండర్ లీవ్స్, సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం డిమాండ్లతో నిరసన చేస్తున్నట్లు తెలిపారు. టీచర్లు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

పాపిరెడ్డిపల్లిలో కొనసాగుతున్న పోలీస్ పికెట్


కూడలిలో పహారా కాస్తున్న పోలీసులు

రామగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డి పల్లిలో ఆదివారం జరిగిన సంఘటనతో గ్రామంలో పోలీసులు పికెట్ కొనసాగిస్తున్నారు. బాధితులు, నిందితుల ఇళ్ల ఇద్ద మంగళవారం పికెట్ కొనసాగింది. గ్రామంలోని వీధుల్లో పోలీసులు పర్యటిస్తున్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగ కుండా ఎస్పీ రత్న, ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ బందో బస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ, ప్రత్యేక నిఘా ఉంచారు. రాత్రిళ్లు కూడా పోలీసు ఉన్నతాధికారులు గ్రామంలో తనిఖీలు చేపడుతున్నారు. కొత్తవారు ఎవరైనా గ్రామంలోకి వస్తే వారి వివరాలపై ఆరాతీసి పంపుతున్నారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

శింగనమల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రం లోని పదోతరగతి పరీక్షా కేంద్రాలను అనంతపురం ఆర్డీఓ కేశవ రెడ్డి తనిఖీ చేశారు. చివరిదైన సాంఘిక శాస్త్రం పరీక్ష జరుగు తున్న మూడు పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ సాకే బ్రహ్మయ్యతో కలిసి పరిశీలించారు. మౌలిక సదుపాయలు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిక


జంబూరు శ్రీనివాసులు

రామగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురానికి చెందిన జంబూరు శ్రీనివాసులును మహర్షి వాల్మీకి సంఘం రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడిగా ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎంపికచేసింది. ఈ ఎంపికపై వాల్మీకి సంఘం మండల నాయకులు మంగళవారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన శ్రీనివాసులు మాట్లాడుతూ... వాల్మీకుల సంక్షే మం, అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషిచేస్తానన్నారు. వాల్మీకుల ఆశయమైన ఎస్టీ సాధన కోసం ఉద్యమాలు చేస్తామన్నారు. గ్రామాలలో వాల్మీకి యువతను చైతన్య పరచి అభివృద్ధి కోసం పోరాడుతామన్నారు.

పంటనష్ట పరిహారం పంపిణీ

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గుత్తి రేంజ్ పరిధిలో గుంతకల్లు మండలం నీలగొండ గ్రామానికి చెందిన జయప్పకు చెందిన పంట పొలాన్ని వన్యప్రాణులు ధ్వంసం చేశాయి. జయప్ప అందుకు అనుగుణంగా అటవీ అధికారులకు రికార్డులు అందజే శాడు. స్పందించిన డీఎఫ్ఓ విఘ్నేష్ ఉత్తర్వుల మేరకు రేంజర్ మధుబాబు చేతుల మీదుగా బాధిత కుటుంబానికి నష్ట పరిహారంగా మంగళవారం రూ. 20 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రేంజర్ మధుబాబు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నష్ట పరిహారాల పంపిణీని క్లియర్ చేస్తున్నట్లు రేంజర్ తెలిపారు.

నాటకానికి రూ.50వేల ఆర్థికసాయం

ఆత్మకూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోపుదుర్తిలో పౌరాణిక నాటకానికి పరిటా రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ. 50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ మంగళవారం రాత్రి గ్రామస్థులకు అందజేశారు. గ్రామాల్లో సంప్రదాయ కళలను ప్రోత్సహించడానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ చొరవ చూపుతున్నట్లు తెలిపారు. ప్రజలు సంతోషంగా ఉండాలని వారి కోరిక మేరకు ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, టీడీపీ మండల నాయకులు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, రాజేష్ పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి


పాటలు పాడుతున్న గాయకులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని పద్మశ్రీ ఘంటసాల సాంస్కృతిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సంగీత విభావరి శ్రోతలను అలరించింది. హౌసింగ్‌బోర్డు రాజీవ్ చిల్డ్రన్ పార్కులోని ఘంటసాల మండపం వద్ద ఈ కార్యక్రమం సాగింది. గాయకులు ఘంటసాల పాటలతోపాటు అలనాటి మధురగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు జీవీ రామయ్య, ఓబుళదాస్, ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనభోజనం

● రంజాన్ మరుసటి రోజు శిల్పారామంలో సందడి చేసిన ముస్లింలు
● సాయంత్రందాకా ఆటపాటలతో గడిపి.. ఇళ్లకు తిరుగుప్రయాణం


బంధు మిత్ర సమేతంగా భోజనం చేస్తూ..


ఊయలలూగుతూ...

- అనంతపురం రూరల్ (ఆంధ్రజ్యోతి)



చిన్నారుల సందడి


చిన్నారుల జలకాలాట


మూటాముల్లె సర్దుకుని ఇంటికి తిరుగుముఖం

పింఛన్ల పంపిణీని పరిశీలించిన కమిషనర్


పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్రైం, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): నగర కమిషనర్ బాలస్వామి మంగళవారం నగరంలో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. అలాగే కలెక్టరేట్ నుంచి జేఎన్‌టీయూకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా పారిశుధ్య పనులను పరిశీలించారు. డివైడర్ మధ్యలో పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. శారదానగర్‌లో రోడ్డుకు ఇరువైపులా పారిశుధ్యం అధ్వానంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. డోర్ టు డోర్ చెత్త సేకరణ పూర్తయ్యాక చెత్త కింద పడిపోకుండా ట్రాక్టర్ ట్రాలీకి నెట్ కట్టుకోవాలని సూచించారు. 63వ సచివాలయ పరిధిలోని నాలుగో రోడ్డులో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. పింఛన్లు సజావుగా పంపిణీ చేయాలని సూచించారు. కల్వర్టులు దెబ్బతిని ఉంటే వాటిని సరి చేయాలని సూచించారు. అన్నక్యాంటీన్లలో అల్పాహార పంపిణీని తనిఖీ చేశారు. డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంహెచ్ఓ విష్ణు మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీ చేసిన టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచనల మేరకు నగరంలోని అన్ని డివిజన్లల్లో టీడీపీ నాయకులు, స్థానిక సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు మంగళవారం పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. స్థానిక రెండో డివిజన్‌లో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, టీడీపీ బీసీ సెల్ నాయకులు సిమెంట్ పోలన్న పాల్గొన్నారు. అలాగే 31వ డివిజన్‌లో టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, 42వ డివిజన్‌లో టీడీపీ నాయకులు ఓంకార్‌రెడ్డి, 21వ డివిజన్‌లో తెలుగు యువత రాష్ట్ర నాయకులు లక్ష్మీనరసింహ, నాయకులు రమేష్, చెరుకుతోట పవన్‌కుమార్, 39వ డివిజన్‌లో టీడీపీ బెస్త సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ చేపల హరి పింఛన్ పంపిణీ చేశారు.

రూరల్ మండలంలో 94శాతం పంపిణీ

అనంతపురంరూరల్,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):మండలంలో 94శాతం పెన్షన్ పంపిణీ చేసినట్లు ఎంపిడిఓ దివాకర్ తెలిపారు. మంగళవారం మండలంలో సచివాలయ ఉద్యోగులు పెన్షన్ పంపిణీ చేపట్టారు. మండల వ్యాప్తంగా 17,542 పెన్షన్లు ఉన్నాయి. ఇందులో 16,548 పెన్షన్లు పంపిణీ చేశారు. రూ.7.34కోట్లు నగదు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

గార్లదిన్నెలో 95.43 శాతం...

గార్లదిన్నె, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పంపిణీని మండలంలో 95.43 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, వివిధ ఉద్యోగులతో పాటు సచివాలయం సిబ్బంది ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పింఛన్ దారులతో ప్రతి నెల ఒకటో తేదీ ఇంటివద్దకు వచ్చి పింఛన్ అందచేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, మహేశ్వర్‌రెడ్డి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయ్యాకే ప్రజలకు భరోసా

● త్వరలోనే అర్హులందరికీ పింఛన్లు: ఎమ్మెల్యే పరిటాల సునీత


వెంకటాపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకే రాష్ట్ర ప్రజలకు భరోసా వచ్చిందని ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. ఎమ్మెల్యే మంగళవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీచేశారు. వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. ప్రతినెల ఒకటో తేదీ ఇంటి వద్దకు పింఛన్ వస్తోందా... లేదా.. అని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో గత ఐదేళ్ల ప్రజలు అభద్రతా భావంతో ఉండేవారని, ఇప్పుడే ప్రజలకు నమ్మకం, భరోసా వచ్చిందన్నారు. ప్రతినెల ఒకో తేదీన తలుపు తట్టి పింఛన్ ఇస్తున్న ప్రభుత్వం ఇదే అన్నారు. గత వైసీపీ హయాంలో అర్హులైన చాలామంది పింఛన్లు తొలగించారన్నారు. ఎలాంటి వైకల్యం లేకుండా చాలామంది పింఛన్లు పొంది ఇప్పటికీ తీసుకుంటున్నారన్నారు. అలాంటి పింఛన్లు తొలగిస్తామన్నారు. అలాగే అర్హులైన అందరికీ పింఛన్లు త్వరలో వస్తాయని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఎంఈఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు రామోజీ, సుబ్రహ్మణ్యం, రమణ పాల్గొన్నారు.



భూమికి పచ్చని రంగేసినట్లు..!

శింగనమల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అతిపెద్ద చెరువులలో ఒకటైన శ్రీరంగరాయని చెరువు ఆయకట్టు కింద వరిసాగు కనుచూపు మేర పచ్చదనంతో కళకళలాడుతోంది. భూమికి పచ్చని రంగేసినట్లుగా కనిపిస్తోంది. శింగనమల శ్రీరంగ రాయని చెరువు కింద 1500 ఎకరాల ఆయకట్టులో ఈ సారి రైతులు వరి సాగు చేశారు. వరిపంట ప్రస్తుతం వెన్నుదశలో ఉడడంతో కనుచూపు మేర పచ్చగా ఉంది. ఈ సంవత్సరం చెరువులో పంటకు అవసరమైన నీరు ఉండడంతో రైతులు ఎక్కువ శాతం వరి పంట సాగు చేశారు. పంట పచ్చదనం చూసి తాడిప్రతి, శింగనమల, గార్లదిన్నెకు వెళ్లే ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

తాగునీటికి కటకట..!

● బోరు, మోటారు ఉన్నా.. విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం
● ఎనిమిది నెలలుగా ఇబ్బందులు పడుతున్న ఎస్సీ కాలనీవాసులు


విద్యుత్ కనెక్షన్ లేని బోరు

శింగనమల, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపురం గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీలో ప్రజలు తాగునీటి సమస్యతో అల్లాడిపోతున్నారు. కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించేదుకు ఎనిమిది నెలలు కిందట ఆర్డీటీ వారు బోరు వేసి, మోటారు ఏర్పాటు చేశారు. కానీ పంచాయతీ అధికారులు మోటారుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు. నిధులు లేవని కాలం గడుపుతున్నారు. శివపురం గ్రామానికి చెం దిన ఎస్సీ కాలనీకి గతంలో తాగునీరు బోరు నుంచి పైపు లైన్లు ద్వారా నీరు సరఫరా అయ్యేది. అనంతపురం-తాడిపత్రి హైవే రోడ్డు పనులు జరగడంతో బోరు, పైపులైన్లు పూర్తిగా దెబ్బతిని కాలనీ వాసులకు నీటి సమస్య వచ్చింది. వారు ఎన్నిసార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. విషయం తెలుసుకున్న ఆర్డీటీ ఎనిమిది నెలలు కిందట బోరు వేసి, మోటారు బిగించారు. విద్యుత్ కనెక్షన్ కోసం పంచాయతీ సర్పంచ్ తీర్మానం చేసి, విద్యుత్ కనెక్షన్, స్తంభాలు, వైరు కోసం కొంత సొమ్ము చెల్లించాలి. మోటారుకు విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ అధికారులు ఎస్టిమేషన్ వేసి, రూ.1.84లక్షలు చెల్లించాలని తెలిపారు. పంచాయతీలో డబ్బులు లేకపోవడంతో చెల్లించలేదు. దీంతో విద్యుత్ అధికారులు బోరు మోటారుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. కాలనీలో నీటి సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తాగునీటి బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పది రోజుల్లో కనెక్షన్ ఇస్తాం

పంచాయతీలో నిధులు లేకపోవడంతో శివపురం ఎస్సీకాలనీకి చెందిన బోరుకు విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ అధికారుల ఎస్టిమేషన్ డబ్బులు చెల్లించలేదు. వేసవిని దృష్టిలో పెట్టుకుని 15 ఆర్థిక సంఘం నిధులను మండల పరిషత్ నుంచి మూడు రోజుల కిందట రూ.1.84లక్షలు విద్యుత్ శాఖకు పంపాం. పది రోజుల్లో ఆ కాలనీ బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. కాలనీకి నీటిని సరాఫరా చేస్తాం.

- భాస్కర్, ఎంపీడీఓ, శింగనమల

ఘనంగా గావుల మహోత్సవం


గావుల మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటికొండ గ్రామంలో మంగళవారం గావుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అక్కదేవతల ఉత్సవాలు ముగిసిన అనంతరం మరుసటి రోజు పోతలయ్యస్వామికి ప్రతిఏటా ఇక్కడ గావుల మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పోతలయ్య స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్థానికులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తునతరలివచ్చారు. అలాగే ముష్టికోవెల గ్రామంలో వెలసిన గ్రామదేవత పెద్దమ్మకు జ్యోతుల, బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు. స్థానికంగా మహిళలు జ్యోతులు, బోనాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.

కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు


అలంకరణలో నిదనవాడ సుంకలమ్మ

శింగనమల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉగాది వేడుకల సందర్భంగా మండలంలో పలు అమ్మవారి ఆలయలు భక్తులతో కిటకిలాడాయి. మండలంలోని నిదనవాడ సుంకలమ్మ, శివపురం పెద్దమ్మ, శింగనమల నల్లమ్మ, కల్లుమడి నల్లమ్మ తదితర అమ్మవారి ఆలయాల్లో మంగళవారం అమ్మవార్లకు భక్తులు బియ్యం, బేడలు, నైవేద్యం సమర్పించారు. మూగ జీవాలను బలి ఇచ్చారు. మొక్కులు తీర్చుకున్నారు. అలాగే రాచేపల్లి నరసింహస్వామి గుడి వద్ద పండుగ గురవయ్యల పాల విన్యాసం భక్తులను ఆకట్టుకుంది

ప్రసన్నాయపల్లిలో పెద్దమ్మ జాతర


అలంకరణలో పెద్దమ్మ దేవత

రాప్తాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నాయపల్లిలో మంగళవారం పెద్దమ్మ జాతర నిర్వహించారు. ఏటా ఉగాది అనంతరం పెద్దమ్మ దేవర జరపడం ఆనవాయితీ గా వస్తోంది. అందులో భాగంగా మంగళవారం అమ్మవారికి పొట్టేళ్ల బలి ఇచ్చారు. ఈ సందర్భంగా రాప్తాడు సీఐ శ్రీహర్ష గ్రామంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ప్రకాష్‌రెడ్డితోనే గ్రామాల్లో ఫ్యాక్షన్ గొడవలు

● టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండి పరశురాం

అనంతపురం విద్య, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ వల్లే పచ్చని గ్రామాల్లో ఫ్యాక్షన్ గొడవలు జరుగుతున్నాయని, ఆయన పద్ధతి మార్చుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కురుబ లింగమయ్య మృతికి, రాజకీయ పార్టీలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తన పబ్బం గడుపుకోడానికి గ్రామాల్లో తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి గొడవలు సృష్టిస్తున్నారంటూ మండిపడ్డారు. 2019 నుంచి 2024 వరకూ ఆయన, ఆయన సోదరులు చేసిన దోపిడీలు, దౌర్జన్యాలు చాలానే ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై ఆత్మకూరులో రౌడీషీట్ ఓపెన్ చేయించి వేధించారన్నారు. నాడు దోపిడీలు, దాడులు, దౌర్జన్యాలు చేసిన ఆయన ఇప్పుడు చట్టాలు, రాజ్యాంగం గురించి మాట్లాడుతూ శ్రీరంగ నీతులు వల్లించాలని చూస్తున్నారంటూ మండిపడ్డారు.

నీటి తొట్టె నిర్మాణానికి భూమిపూజ


ఉప్పరపల్లిలో భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లిలో ఉపాధి హామీ పథకం కింద పశువుల నీటి తొట్టె నిర్మాణానికి టీడీపీ నాయకులు, అధికారులు మంగళవారం భూమి పూజ చేశారు. ఏపీఓ చంద్రకళ, టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగేమురళి మోహన్, జడ్పీటీసీ చంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

● రాప్తాడు: మండలంలోని హంపాపురం గ్రామంలో బాలుర బీసీ వసతి గృహం వద్ద పశువుల తాగు నీటి తొట్టె నిర్మాణానికి ఏపీడీ చెన్న కేశవులు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాంమోహన్, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈఓఆర్డీ ఆనంద్, ఎంపీటీసీ రవి తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: నియోజకవర్గ కేంద్రమైన శింగనమల, గుమ్మేపల్లి, చక్రాయపేట గ్రామాల్లో మంగళవారం పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీఓ భాస్కర్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దేగలకృష్ణమూర్తి, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆదినారాయణ భూమి పూజ చేశారు. ఏపీఓ శ్రీదేవి, సర్పంచ్ దేగల లలితమ్మ, దేగల కృష్ణమూర్తి, ఆదినారాయణ, గార్లదిన్నె పత్తి, మాసూల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

● కనగానపల్లి: మండల కేంద్రంలో పశువుల నీటి తొట్టె నిర్మాణానికి మంగళవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు భూమి పూజ చేశారు. ఎంపీడీఓ అనిల్‌కుమార్, ఏపీఓ వెంకటేశ్‌నాయక్, సర్పంచ్ అంకే రామకృష్ణ, తెలుగుయువత బట్టా సురేశ్‌చౌదరి, అంకే చంద్ర, బట్టా తిరుపాలు, చల్లా సోము, నెట్టెం శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష


ఉట్లమాను ఎక్కుతున్న యువకులు

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఉట్లపరుష ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా మాదిరిగానే స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం ఉట్ల పరుష కార్యక్రమం ఎంతో ఆసక్తికరంగా సాగింది. ఉట్లమాను ఎక్కడానికి చిన్న, పెద్ద అన్న తారతమ్యం లేకుండా పోటీ పడ్డారు. అంతకు మునుపు ఉట్ల మానును గ్రామంలో ఊరేగిస్తూ వసంతోత్సవం నిర్వహించారు. సాయంత్రం కొండమీద వెంకటరమణ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉట్లమాను పరుష వద్దకు తీసుకొచ్చారు. ఈ పోటీని తిలకించడానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఉట్లమాను విజేతగా నిలచిన మురళి అనే యుకుడికి గ్రామస్థులు ఆధ్వర్యంలో బహుమతి అందజేశారు.

సంక్షిప్త వార్తలు

భర్త చనిపోయిన నెలకే పింఛన్



పింఛన్ సొమ్ము అందజేస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నేసేపేటలో నెల క్రితం పరమేష్ అనే వ్యక్తి చనిపోగా ఆయన భార్య పద్మావతికి మంగళవారం పింఛన్ అందజేశారు. నెల వ్యవధిలోనే ప్రభుత్వం నుంచి పింఛన్ మంజూరు కావడంతో కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, మాబుసాబ్, చాంద్‌బాషా, అనిల్, చాకలి ప్రసాద్, మల్లికార్జున, హనుమంతరాయుడు, రాజన్న పాల్గొన్నారు.

అప్కాస్ విధానాన్ని రద్దు చేయాలి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో అప్కాస్, ప్రైవేట్ ఏజెన్సీలను రద్దు చేయాలని సీఐటీయూ, మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కార్మికులకు పనిముట్లు, తోపుడుబండ్లు, పరకలు, సబ్బులు, దుస్తులు ఇవ్వాలన్నారు. అనంతరం కమిషనర్ నయీమ్ ఆహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, సాకే నాగరాజు, నరసయ్య, రంగనాయకులు, కృష్ణ, దాసు, సామెల్, హనమంతు, ఎర్రమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని తాడిపత్రి రోడ్డులో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గా యపడ్డారు. యాడికికి చెందిన శ్రీరాములు, శ్రీనివాసులు ఇ ద్దరు గుత్తికి వచ్చి తిరిగి వెళ్తుండగా పట్టణ శివారులో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకింది. ఇరువురు తీ వ్రంగా గాయపడగా ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

13న గురుకుల ప్రవేశ పరీక్ష

గుత్తిరూరల్ ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో ఇంటర్, 5వ తరగతిలో ప్రవేశానికి రాత పరీక్షలు నిర్వహిస్తునట్లు ప్రిన్సిపాల్ విజయ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న జరగాల్సిన రాత పరీక్షను 13న నిర్వహిస్తునట్లు ఆమె తెలిపారు. 5వ తరగతికి ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఇంటర్‌కు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తుట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టిక్కెట్టుతో పాటు ఆధార్ కార్డు తీసుకుని రావాలని తెలిపారు.

నేడు ప్రజాదర్బార్

గుత్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజా సమస్యల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

4 నుంచి ఉచిత శిక్షణ

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక కొనకొండ్ల రోడ్డులోని ఎస్‌వీఐఎస్ ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ కోసం ఉచిత శిక్షణను ఈనెల 4 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆ కళాశాల కరస్పాండెంట్ ఓంకారప్ప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వశిష్ట కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారన్నారు. సరోజినాయుడు మున్సిపల్ బాలికల పాఠశాలలో గురువారం నుంచి పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌కు ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్‌వీ రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

రెండురోజులు నిరసనలు

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ రెండురోజుల పాటు ఎర్రబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి తిప్పేస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెంట్రల్ కమిటీ నిర్ణయం మేరకు 2,3 తేదీల్లో ఆయా డిపోల పరిధిలో ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాడిపత్రి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాదేవిపల్లి గ్రామసమీపంలో ఉన్న యర్రగుడి గంగమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు సమర్పించి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు.

●యల్లనూరు : మండలంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యల్లనూరు, కొడవండ్లపల్లి గ్రామాల్లో పెద్దమ్మకు, చిలమకూరులో ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాలయాల వద్ద ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి బందోబస్తు నిర్వహించారు.

సెల్‌ఫోన్ చోరీపై ఫిర్యాదు

గుత్తి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో నివాసమున్న మహబుబ్‌బాష తన సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన ఇంటి మిద్దెపైన వారం క్రితం నిద్రిస్తున్నప్పుడు గుర్తుతెలియని వ్యక్తులు సెల్‌ఫోన్‌ను అపహరించారన్నారు. మంగళవారం తన ఫోన్‌పేలో ఉన్న డబ్బును ఏటీఎంలో డ్రా చేసుకోవడానికి వెళ్లగా అందులో ఉన్న రూ.15వేలు డ్రాచేశారని పోలీసుల వద్ద వాపోయాడు. ఈ సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గుడి వద్ద పింఛన్ల పంపిణీ

శెట్టూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పింఛన్లను ఇంటివద్దకే వెళ్లి ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా.. మండలంలోని బసంపల్లిలో సిబ్బంది గుడి వద్దకే లబ్ధిదారులను రప్పించి పంపిణీ చేశారు. మంగళవారం బసంపల్లిలో 75 మందికి గుడి వద్ద పింఛన్లు పంపిణీ చేశారు. ఇక మీదటైనా ఇంటింటికి పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



బసంపల్లి మారెమ్మ గుడి వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

కంబదూరుకు 20 పడకలు కలేనా..?

● కొన్నేళ్ల నుంచి హామీలకే పరిమితం ● రోజూ 100 నుంచి 180 దాకా ఓపీ

కంబదూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోనే పెద్ద మండలంగా పేరు పొందిన కంబదూరుకు 20 పడకల ఆసుపత్రి కలగానే మారింది. గత కొన్నేళ్ల నుంచి అధికార యంత్రాంగం హామీలకే పరిమితమైంది. ప్రతిరోజూ ఈ ఆసుపత్రికి 100 నుంచి 180 మంది దాకా ఓపీకి రోగులు వస్తుంటారు. ఉన్నతాధికారులు ఈ ఆసుపత్రి బాగోగులపై దృష్టి సారించడం లేదు. మండల వ్యాప్తంగా 12 పంచాయతీలు, 42 గ్రామాలు, 12 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. నిత్యం ఈ ఆసుపత్రి రద్దీగా ఉంటుంది. రోగుల స్థాయికి తగ్గట్టుగా పడకలు లేకపోవడంతో వైద్యసేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. అత్యవసరంగా వచ్చినా ప్రతి రోగిని కళ్యాణదుర్గం సీహెచ్‌సీకి రెఫర్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికితోడు కర్ణాటక ప్రాంతానికి ఈ మండలం దగ్గరగా ఉండడంతో రోగులు చాలా మంది వైద్య పరీక్షలకు ఇక్కడికి వస్తుంటారు. గతంలో ఇక్కడే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తుండేవారు. రానురాను ఈ ఆపరేషన్ థియేటర్‌ను కూడా మూసివేశారు. ప్రతిసారి అధికారి యంత్రాంగం, ప్రజాప్రతినిధులు రావడం హామీలివ్వడంతో కాలం గడిచిపోతోంది. కొత్తగా మరికొంతమందిని నియమించడంతో పూర్తి స్థాయిలో సిబ్బంది కొరత తీరిపోయింది. దానికి తగ్గట్టుగా ఆసుపత్రి స్థాయిని పెంచితే మరింత మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కంబదూరు ప్రభుత్వాసుపత్రి

పింఛన్లు పంపిణీ చేసిన విప్, కలెక్టర్



తాళ్లకెరలో పింఛన్ పంపిణీ చేస్తున్న విప్ కాలవ, కలెక్టర్ వినోద్‌కుమార్, నాయకునిపల్లిలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

గుమ్మఘట్ట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లకెర గ్రామంలో మంగళవారం ఉదయం ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, కలెక్టర్ వినోద్‌కుమార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు కొంత మందికి తమ చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని కాలనీలలో పర్యటించి గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన గోకులం షెడ్‌ను ప్రారంభించారు. గ్రామశివారులో పశువుల దాహార్తిని తీర్చే నీటితొట్టి నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం పనులు అర్ధంతరంగా ఆగిపోయాయని గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు తిప్పేస్వామి వినతి పత్రం ఇచ్చారు. గ్రామంలో జంగమ కులస్థులకు శ్మశానవాటిక లేదని, స్థలం చూపాలంటూ కోరారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ నాగరాజు, డ్వామా పీడీ సలీంబాషా, ఎంపీడీఓ రామకృష్ణ, తహశీల్దార్ మునివేలు, ఏపీఓ సురేష్, టీడీపీ నాయకులు గిరిమల్లప్ప, నన్నన్న, రాజు, శ్రీరాములు, రామన్న, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

● పుట్లూరు: ప్రతినెలా 1వ తారీఖున గడప వద్దకే పెన్షన్ పంపిణీ చేయడం శుభపరిణామమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. మండలంలోని నాయకునిపల్లిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి మంగళవారం లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ ఇస్తామని తెలిపారు. అనంతరం మండలకేంద్రంలో రూ.33వేలతో నిర్మించే పశువుల తాగునీటి తొట్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలమ్మ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి.. గ్రామస్థుల సంబరాలు



నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న గడేకల్లు గ్రామస్థులు

విడపనకల్లు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లు గ్రామంలో బీటీ రోడ్డు పనులు పూర్తి కావటంతో గ్రామస్థులు సంబరాలు చేసుకున్నారు. ఈమేరకు వారు మంగళవారం పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం, అనంతరం కేక్ కట్‌చేశారు. ఆరేళ్ళుగా నిలిచి పోయిన రోడ్డు పనులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయటంపై గ్రామ ప్రజలు, వాహన డ్రైవర్లు హర్షం వ్యక్తం చేశారు. 67వ జాతీయ రహదారి పనులు వైసీపీ ప్రభుత్వంలో చేయక పోవటంతో గడేకల్లు, డొనేకల్లు గ్రామాల ప్రజలు వాహనాల నుంచి వచ్చే దుమ్ము దూలికి తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉండేవారు. మంత్రి పయ్యావుల చొరవతో గడేకల్లు వాసుల కల నెరవేరింది. కేక్‌లు కట్ చేశారు. ఈ సందర్భంగా నాగవేణి, సువర్ణ, పుష్పావతి, సర్మాస్ తదితరులు మాట్లాడుతూ.. ఆరేళ్లుగా దుమ్ము దూళితో తీవ్ర ఇబ్బందులు పడ్డామని, వైసీపీ ప్రభుత్వంలో ధర్నాలు, ఆందోళనలు చేసినా ఏ నాయకుడు స్పందించలేదని తెలిపారు.

పంటనష్ట పరిహారం పంపిణీ

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మండలం నీలగొండ గ్రామానికి చెందిన జయప్పకు చెందిన పంట పొలాన్ని వన్యప్రాణులు ధ్వంసం చేశాయి. జయప్పకు అటవీ అధికారులకు రికార్డులు అందజేశాడు. స్పందించిన డీఎఫ్‌ఓ విఘ్నేష్ ఉత్తర్వుల మేరకు రేంజర్ మధుబాబు బాధిత కుటుంబానికి నష్ట పరిహారంగా మంగళవారం రూ. 20 వేల చెక్కును అం దజేశారు. రేంజర్ మధుబాబు మాట్లాడుతూ.. రైతుకు సంబంధించిన పొలంలోని పంటలకు వన్యప్రాణుల ద్వారా నష్టం వాటిల్లిందన్నారు. పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరిహారం చెల్లించామన్నారు.

పాల్తూరులో మంచినీటి బోరు ఏర్పాటు

విడపనకల్లు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ బ్యూవులారాణి తాగు నీటి బోరును ఏర్పాటు చేయించారు. మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు ఆదేశాలతో గ్రామంలో మంచి నీటి బోరును ఏర్పాటు చేయించినట్లు సర్పంచ్ తెలిపారు. నీళ్లు పడడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్న మారయ్య, మారయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

నీటి తొట్టెల నిర్మాణానికి భూమిపూజ

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూగేపల్లిలో జాతీయ ఉపాధి హామీ పథకంలో మంజూరైన పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి మంగళవారం టీడీపీ నాయకులు భూమిపూజను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంజునాథ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● కుందుర్పి : మండలంలోని జంబుగుంపల గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో పశువులకు మంచినీరు అందించే నీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనుంజయ, రవి, చిత్రలింగప్ప, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవడుగూరు: ఉపాధి హామీ పథకం కింద పెద్దవడుగూరు, గుత్తిఅనంతపురం గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణానికి టీడీపీ మండల కన్వీనర్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ పుల్లారెడ్డి, టీడీపీ నాయకులు ప్రసాద్‌యాదవ్, తిలక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును పంపిణీ చేస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నింబగల్లు గ్రామానికి చెందిన తిప్పన్నకు టీడీపీ సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. అనంతపురంలో మంగళవారం మంజూరైన రూ. 30,640 చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిద్దప్ప, వెంకటేశులు, సూరిబాబు, పర్వతప్ప, రామాంజనేయులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



గొడుగులను పంపిణీ చేస్తున్న ఉత్తరాధికారి

ఉరవకొండ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టవర్‌క్లాక్ కూడలిలో అభయ ఫౌండేషన్ సహకారంతో చిరువ్యాపారులకు గొడుగులను ఉచితంగా పంపిణీ చేశారు. గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి మంగళవారం వాటిని అందజేశారు. అలాగే మొక్కలు కావాల్సిన వారు 9963498250 నంబర్‌కు సంప్రదించవచ్చు అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జనార్ధననాయుడు, ఏఎస్‌ఐ పాల్, నిస్వార్థ ఫౌండేషన్ సభ్యుడు వెంకట్ పాల్గొన్నారు.

కాలువ వెడల్పు చేయాలి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో పది వేల క్యూసెక్కుల నీరు వచ్చే విధంగా వెడల్పు చేయాలని కోరుతూ ఆర్డీఓ శ్రీనివాస్‌కు మంగళవారం సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బి. శ్రీనివాసులు మాట్లాడుతూ హంద్రీనీవా కాలు వెడల్పు పనులు జరుగుతున్నాయన్నారు. పదివేల క్యూసెక్కుల నీరు వచ్చే వరకు లైనింగ్ పనులు చేయకూడదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మారుతిప్రసాద్, జగ్గలి రమేష్, సురేంద్ర, చంద్రశేఖర్, రామునాయక్, ఈరన్న, డానియేల్ పాల్గొన్నారు.

రామాయణ ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లులో ఆపాలి



వినతి పత్రం ఇస్తున్న విజయలక్ష్మి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రామాయణ ఎక్స్‌ప్రెస్ రైలును గుంతకల్లులో ఆపాలని కోరుతూ రైల్వే బోర్డు మెంబర్ విజయ్‌ప్రతాప్‌సింగ్‌కు మంగళవారం ఢిల్లీలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అయోధ్య నుంచి శ్రీలంకకు వెళ్తున్న రామాయణ ఎక్స్‌ప్రెస్ రైలు కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనం కొరకు దేవాలయాన్ని అందులో విలీనం చేయాలన్నారు.

అమిలినేని కృషితో కళ్యాణదుర్గం అభివృద్ధి

● హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ● వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యేలు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు అమిలినేని, కాలవ

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కళ్యాణదుర్గం నియోజకం వర్గం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతుందని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని మోరేపల్లిలో ఎస్‌ఆర్‌సీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, ఎంఎస్ రాజు హాజరయ్యారు. అనంతరం ఎస్‌ఆర్‌సీ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే ఏమిటో సురేంద్రబాబు కళ్లకు కట్టినట్లు చూపిస్తారని కొనియాడారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడు ముందు ఉంటానని తెలిపారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఎస్‌ఆర్‌సీ ఆధ్వర్యంలో మారుమూల గ్రామాల్లో సైతం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమం అని అభినందించారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. అమిలినేని సేవలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, టీడీపీ నాయకులు చౌళం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



కళ్యాణదుర్గం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది ఎవరైనా ఐపీఎల్‌లో బెట్టింగ్ ఆడినట్లు తెలిస్తే శాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు హెచ్చరించారు. దాదాపు 60 రోజుల పాటు సాగే ఐపీఎల్‌లో బెట్టింగుల కు ఆశపడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. బె ట్టింగులపై పూర్తి స్థాయిలో నిఘా ఉం చామన్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న : ఐపీఎల్ జరుగుతున్న దృష్ట్యా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు : ఐపీఎల్ సందర్భంగా బెట్టింగులను అరికట్టడానికి ప్రత్యేక టీం ఏర్పాటు చేశాం. ప్రధాన కూడళ్లల్లో నిఘా వేశాం. బెట్టింగుల ఉచ్చులో పడి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దు.

ప్రశ్న : కర్ణాటక సరిహద్దు మండలాల్లో బెట్టింగుల నియంత్రణ ఎలా..?

జవాబు : నియోజకవర్గానికి కర్ణాటక సరిహద్దులో మూడు మండలాలు ఉన్నాయి. అక్కడి ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బందితో నిఘా వేసి ఉంచాం.

ప్రశ్న : ఇంతవరకు ఎక్కడైనా కేసులు నమోదు చేశారా..?

జవాబు : ఇంతవరకు ఎక్కడా కేసులు నమోదు చేయలేదు. యువతకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. బెట్టింగుల ఉచ్చులో పడకుండా సరదాగా ఐపీఎల్ తిలకిస్తూ గడపాలని సూచిస్తున్నాం.

ప్రశ్న : చోరీల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు : రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ నిర్వహించి ఎప్పటికప్పుడు నిఘా వేస్తున్నాం.

ప్రశ్న : డ్రోన్ కెమెరాలతో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు : పట్టణమంతా డ్రోన్ కెమెరాలతో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. జాతరల సమయాల్లో డ్రోన్ కెమెరా ఉపయోగపడుతుంది.

ప్రశ్న : బియ్యం అక్రమ రవాణాపై తీసుకుంటున్న చర్యలేమిటి..?

జవాబు : బియ్యం అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఆయా గ్రామాల ప్రజలు సమాచారం ఇస్తే మరిన్ని చర్యలు తీసుకుంటాం.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి, పవన్‌రెడ్డి

పుట్లూరు, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకునిపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా హాజరైన తాడిపత్రి, శింగనమల ఎమ్మెల్యేలు జేసీ అశ్మిత్‌రెడ్డి, బండారు శ్రావణిశ్రీ, టీడీపీ నేత జేసీ పవన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ మాట్లాడుతూ.. రాతిదూలం లాగుడు పోటీలతో రైతుల్లో ఉత్సాహం నెలకొంటుందని పేర్కొన్నారు. అనంతరం బాట సుంకులమ్మ తిరుణాలలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాలరంగయ్య, సుదర్శన్‌నాయుడు, చవ్వా కులశేఖర్ రెడ్డి, పుల్లారెడ్డి, చెన్నారెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్‌రాజు, వేణు, రవీంద్రచౌదరి, రామాంజి పాల్గొన్నారు.

● యాడికి: ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని పెద్దపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన రాతిదూలం లాగుడుపోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. పోటీల్లో 10 జతల వృషభాలు పాల్గొన్నాయి. విజేత జట్టుకు మొదటి బహుమతిగా రూ.20వేలు, రెండో బహుమతి రూ.15వేలు, మూడో బహుమతిగా రూ.10వేలు అందజేశారు.

ఘనంగా రససిద్ధేశ్వరస్వామి రథోత్సవం



రససిద్ధేశ్వరస్వామి గుర్రాల ఊరేగింపు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని సిద్ధులకొండపై వెలసిన రససిద్ధేశ్వరస్వామి రథోత్సవాన్ని మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి ఉదయాన్నే పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. రాయదుర్గం కోట నుంచి రససిద్ధేశ్వరస్వామి గుర్రాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కొండపై స్వామివారి ప్రతిమను రథంపై ప్రతిష్ఠించి వందలాది భక్తులు నడుమ నందికోలు, యువకుల నృత్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని ప్రజలు పెద్ద ఎత్తున కొండపై చేరుకుని రథోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా సీఐ జయనాయక్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. బుధవారం ఐదు గంటలకు కొండపై దేవాలయం వద్ద సిడి మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బండూరులో మారెమ్మదేవి జాతర

బొమ్మనహాళ్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండూరు గ్రామంలో మంగళవారం మారెమ్మదేవి జాతర ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రతి ఉగాది తర్వాత వచ్చే మొదటి మంగళవారం అమ్మవారి మహోత్సవం జరుగుతుంది. ఉదయం గంగాజలాన్ని ఊరేగింపుగా తెచ్చి అమ్మవారిని అభిషేకించారు. గ్రామస్థులు కుంభాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వచ్చారు. అనంతరం కుంభాలు, పసుపు, కుంకుమ, టెంకాయలు సమర్పించి అమ్మవారిని దర్శించుకొన్నారు.

ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దు

పెద్దవడుగూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరన్నపల్లి, కొం డూరు, నాగలాపురం గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఉన్న పెన్నానది పరివాహక ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు మం జూరు చేయవద్దని ఆయా గ్రామాల ప్రజలు మంగళవారం తహసీల్దార్ ఉషారాణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం టీడీపీ మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి మాట్లాడుతూ.. ఇసుక రీచ్‌లు మంజూరు చేయడం వల్ల భూగర్భజలాలు అడుగంటిపోయి ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే నదిలో ఉన్న ఇసుకను తవ్వడంతో ఊటకాలువ ఎండిపోయి 200 ఎకరాలు బీడు భూములుగా మారాయన్నారు. అధికారులు పరిశీలించి తగు చర్యలు చేపట్టాలన్నారు. వినతిపత్రం అం దించిన వారిలో రామిరెడ్డి, నారాయణరెడ్డి, రామాంజురెడ్డి, నాగరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా బాట సుంకులమ్మ తిరుణాల



అలంకరణలో సుంకులమ్మ

పుట్లూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకునిపల్లి శివారులో వెలసిన బాట సుంకులమ్మ తిరుణాల మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలు పెట్టి, రాగిచెట్టుకు గాజులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం పక్కన ఉన్న రామాంజనేయ ఆలయంలో స్వామికి ప్రత్యేక పూ జలు నిర్వహించారు. మడుగుపల్లిలో బయన్నస్వామి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి ప్రతిమలను గ్రామంలో ఊరేగించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.